

12 నుంచి నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

ఆమనగల్లు : ఈనెల 12 నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సున్న వారందరికీ నులిపురుగు నివారణ మాత్రలు అందిస్తున్నట్లు డాక్టర్ పరీక్షిత్ తెలిపారు. ఈ మేరకు ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఆయన మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో పారుఖ్‌హుస్సేన్, సీడీపీవో సక్కుబాయి, ఎంఈవో సర్ధార్‌నాయక్, ఎంపీహెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, సిబ్బంది శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ అకౌంట్ నుంచి డబ్బు మాయం!

- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో రిటైర్డ్ ఉద్యోగి
- బ్యాంక్ ఖాతా నుంచి రూ.1,49,997 ఖాళీ!

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5: సైబర్ నేరగాళ్లు ఓ రిటైర్డ్ ఉద్యోగి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు తస్కరించిన సంఘటన మేడ్చల్ జిల్లా పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోచారం సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మునిసిపల్ ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో ఉండే ఓ రిటైర్డ్ ఉద్యోగి(71)కి నగరంలోని తార్నాకలో గల ఓ బ్యాంక్‌లో సేవింగ్ అకౌంట్ ఉంది. జనవరి 26న గుర్తుతెలియని వ్యక్తి మాజీ ఉద్యోగికి ఫోన్‌చేసి మీ బ్యాంక్ ఖాతాను అప్‌డేట్ చేయాలి, ఓటీపీ వస్తుంది అది చెప్పాలన్నాడు. దీంతో నిజమని నమ్మిన వృద్ధుడు.. సదరు వ్యక్తి అడిగిన ఓటీపీలను మూడుసార్లు చెప్పాడు. దీంతో అతడి బ్యాక్ ఖాతా నుంచి రూ.49,999 చొప్పున మూడుసార్లు మొత్తం రూ.149,997 ఖాళీ అయ్యాయి. తన బ్యాంక్ నుంచి నగదు తస్కరించిన విషయం గుర్తించి బాధితుడు వెంటనే సదరు నెంబర్‌కు కాల్‌చేస్తే స్విచాఫ్ వచ్చింది. దీంతో రిటైర్డ్ ఉద్యోగి చివరికి సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



చౌదర్‌పల్లిలో విరగపూసిన మామిడితోట

వారెవా.. ఏమి పూత!

యాచారం మండలం చౌదర్‌పల్లిలోని మామిడి తోట ఆకులు కనిపించకుండా విరగపూసింది. ఇలా విరగపూసిన కరుణారెడ్డి తోట బాటసారులను ఆకట్టుకుంటుంది. ఈ చెట్లను చూసేందుకు బాటసారులు ఉత్సాహాన్ని చూపుతున్నారు. ఈ పూత రాలకుండా ఉంటే మామిడి తోట ద్వారా భారీగా ఆదాయం వస్తుందని అంతా చర్చించుకుంటున్నారు.

- యాచారం, ఫిబ్రవరి 5

విద్యార్థులు అక్షర యాత్ర చేయించడంలో అర్ధ శతాబ్దం దాటిన ప్రస్థానం.. పల్లెల నుంచి పట్టణానికి వచ్చి పై చదువులు చదవాలనుకునే విద్యార్థులకు ఇది ఆస్థానం.. కానీ దశాబ్ధాలు గడుస్తున్నా కనీస మరమ్మతులు కరువైన ఈ కళాశాల ప్రస్తుతం ఓ బూత్‌బంగ్లాలా మారిపోయింది. కనీస వసతులు కూడా కరువై విద్యార్థుల చదువులు చతికిలపడుతున్నాయి. ఫలితంగా విద్యార్థులు సర్కారు కళాశాల వద్దంటూ ప్రైవేటు కళాశాలల వైపు పరుగులు పెడుతున్నారు. షాద్‌నగర్ పట్టణంలో ఉన్న ఏకైక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుత పరిస్థితి ఇది. బడుగు, బలహీనవర్గాలు, నిరుపేద విద్యార్థులకు అక్షరాల అండగా నిలవాల్సిన ఈ కళాశాల పరిస్థితి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు.



షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ

చదువుల నిలయం.. సమస్యల వలయం!

ఇదీ షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ దుస్థితి

- ఏళ్ల తరబడి మరమ్మతులు లేక శిథిలం
- వసతుల లేమితో ప్రైవేటు కళాశాలలకు విద్యార్థులు
- మూడేళ్లుగా పర్మనెంట్ ప్రిన్సిపాల్ లేని వైనం

షాద్‌నగర్, ఫిబ్రవరి 5 : విద్యార్థులకు ఉన్నత చదువుల దిశగా తొలి అడుగులు వేయించాలన్న లక్ష్యంతో 1970లో ఈ జూనియర్ కళాశాల భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. షాద్‌నగర్ నియోజకవర్గం మొత్తానికి అప్పట్లో ఇది ఒక్కటే కళాశాల కావడంతో అందులో సీట్ల కోసం విపరీతమైన పోటీ ఉండేది. ఇదే కళాశాలలో ఎంతోమంది విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ప్రస్తుతం ఈ జూనియర్ కాలేజ్‌లో 783 మంది విద్యార్థులు, 14మంది శాశ్వత అధ్యాపకులు, ఏడుగురు కాంట్రాక్టు అధ్యాపకులతో పాటు మరో ఐదుగురు గెస్ట్ లెక్చరర్లు ఉన్నారు. ప్రస్తుతం ఈ కాళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ (ఉర్దూ మీడియం) గ్రూప్‌లతో పాటు 5 వొకేషనల్ శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. అన్ని గ్రూప్‌లలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నా కళాశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. కళాశాల నిర్మాణం జరిగి 54 ఏళ్లు అవుతున్నా ఇప్పటిదాకా ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఫలితంగా కిటికీలు, తలుపులు, గోడల పైపెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేసినా అది నిరుపయోగంగా మారింది. నెలల తరబడి శుభ్రపర్చని వాటర్ ట్యాంక్ నీళ్లే దిక్కవుతున్నాయి. మరోవైపు మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. కళశాలలో అటెండర్, స్వీపర్ లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే నిండిపోయి దుర్గంధం నెలకొంది. అలాగే కళాశాలలోని ల్యాబ్‌లలో ప్రాక్టికల్స్ నిర్వహించడానికి పరికరాల కొరత ఉంది. దీంతో ప్రాక్టికల్స్ నిర్వహణలో అధ్యాపకులకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మూడేళ్లుగా రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో కాలేజీ ఆలనాపాలనా చూసేవారు కూడా కరువయ్యారు. కళాశాలలో సమస్యలు రాజ్యమేలుతుండడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు సైతం ఇక్కడకు వచ్చేందుకు ఇష్టపడడం లేదు. అప్పులు చేసి మరీ ప్రైవేటు కాలేజీల్లో చేరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ఎమ్మెల్యే స్పందించి కాలేజీకి మరమ్మతులు చేయించడంతో పాటు కావాల్సిన కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న ఆర్‌వో ప్లాంట్



ఎంట్రెన్స్‌లో కాలిపోయిన డోర్లు



కళాశాలలో పేరుకు పోయిన చెత్త

కళాశాల పరిస్థితి అధ్వానం



జూనియర్ కళాశాల పరిస్థితి అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్త చెదారమే. ఆర్వో ప్లాంట్ పని చేయకపోవడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు జూనియర్ కళాశాల చాలడం లేదు. ఇందులోనే పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసేందుకు విద్యా శాఖ అధికారులు యోచిస్తున్నారు.

- రవీందర్‌రెడ్డి, లెక్చరర్

కాలేజీకి వెళ్లాలనిపించడం లేదు..



కళాశాలలో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణాన్ని చూస్తుంటే కాలేజీకి వెళ్లాలనిపించడం లేదు. కనీసం తాగడానికి మంచినీళ్లు కూడా లేవు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన పరికరాలు కూడా లేవు. కళాశాల పూర్తిగా అపరిశుభ్రంగా మారింది. కనీసం మాకు మంచినీటి వసతైనా కల్పిస్తే బాగుంటుంది.

- శశికుమార్, వొకేషనల్ విద్యార్థి



ధర్నా చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది

వేతనాలు పెంచాలని ధర్నా

రంగారెడ్డి అర్బన్, జనవరి 5 : వేతనాలను పెంచాలని మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఏపీలో ఇస్తున్న విధంగా రూ. 21 వేలు, 24,500 వేతనం అమలు చేయాలని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ మున్సిపల్ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి. కిషన్, జిల్లా నాయకులు సురేందర్, నర్సింహ, సుభాష్, రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



వినితకు డాక్టరేట్‌ను అందజేస్తున్న యూనివర్సిటీ బృందం

విద్యార్థులు కష్టపడితేనే ఫలితం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాలపై దృష్టి పెట్టి, కష్టపడితేనే భవిష్యత్తులో మంచి ఫలితం లభిస్తుందని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ సీహెచ్ పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో చదువుతున్న బడితపురం వినిత ప్రొఫెసర్ శ్రీనివాస్ పర్యవేక్షణలో రసాయన శాస్త్రంలో సింథిసిస్ అండ్ బయోలాజికల్ ఎవాల్యుయేషన్ ఆఫ్ సమ్ నవల్ పైరాజోల్, తాలజైస్ అండ్ క్వినోక్సిలిస్ డెరివేటివ్స్ అండ్ డెయిరి మాలిక్యూలర్ డాకింగ్ స్టడీస్ అనే అంశంపై పరిశోధన పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆమెకు డాక్టరేట్ రావడంతో ఆ యూనివర్సిటీ చాన్స్‌లర్ పురుషోత్తంరెడ్డి అభినందించారు. డాక్టరేట్ పట్టాను సోమవారం యూనివర్సిటీ ప్రాంగణంలో పురుషోత్తంరెడ్డి వినితకు అందజేశారు. యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్, ప్రత్యేక అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి, ప్రొఫెసర్లు దామోదర్, రిజిస్ట్రార్ ఆచార్య రవీందర్, కవిత, డీన్ క్రిస్టోఫర్, జగదీష్, అధ్యాపక బృందం, పీఆర్వో గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మాజీ మంత్రి సబితారెడ్డి పరామర్శ



చేవెళ్ల, ఫిబ్రవరి 5 : నగరంలోని యశోద ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

కల్యాణం.. కమనీయం

- వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం
- భారీగా హాజరైన భక్తులు

కేశంపేట, ఫిబ్రవరి 5: కొత్తపేట గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం సోమవారం కమనీయంగా సాగింది. గ్రామానికి చెందిన పాలాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమృత లింగేశ్వరస్వామి దేవాలయంలో పండితులు వేదమంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామి వారి కల్యాణానంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో సాధన ఫౌండేషన్ సభ్యులు గట్టు రంగాచార్యులు, తిరుపతి గారి ప్రభాకర్, గ్రామ పెద్దలు నరసింహ, రాజు, రఘురాం గౌడ్, పాలాది వెంకటేష్, భాగ్య విష్ణు తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి కల్యాణానికి హాజరైన భక్తజనం

'ప్రజావాణి' విజ్ఞప్తులను త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ శశాంక




ప్రజా సమస్యలను వింటున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 5 : ప్రజావాణిలో స్వీకరించిన విజ్ఞప్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో కలిసి ప్రజలను నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులు, మండల ఆధికారులు, మున్సిపల్ అధికారులు ప్రతీ సోమవారం ప్రజావాణికి హాజరు కావాలని ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన విజ్ఞప్తులను శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లా శాఖల వారీగా ప్రతీ శాఖకు సోషల్ మీడియాలో ట్విటర్ అకౌంట్ ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేకాధికారులకు ఈ నెల 6న ఓరియేంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఉంటుందన్నారు. ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 నుంచి 14 వరకు ప్రతీ గ్రామంలో శానిటైజేషన్ డ్రైవ్ కొనసాగుతుందని అన్నారు. ప్రజావాణిలో 158 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంటల ఆర్థిక స్థాయి నిర్ణయంలో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలి

బ్యాంకర్లు పంటల ఆర్థిక స్థాయి (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్) నిర్ణయంలో ఉదారంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. వివిధ పంటలకు ఆర్థిక స్థాయి నిర్ణయం (స్కేల్ ఆఫ్ ఫైనాన్స్)పై సోమవారం కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాల బ్యాంకర్లు, ఎల్డీఎంలు, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, పశుసంవర్ధక, అనుబంధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఎక్కువగా ఇస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. బ్యాంకులు ఇచ్చే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ మొత్తాన్ని పెంచినట్లయితే ఎకరాకు వచ్చే రుణ సహాయం సైతం పెరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆర్థిక సాయం నిర్ణయంపై ఉదారంగా ఉండాలన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర స్థాయికి ప్రతిపాదించాలని సూచించారు. ముఖ్యంగా అన్ని రకాల పంటలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ సానుకూలంగా ఇచ్చేందుకు బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీసీసీబీ సీఈవో భాస్కర సుబ్రహ్మణ్యం, రంగారెడ్డి జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి అంజిలప్ప, మత్స్యశాఖ అధికారి సుకిర్తి, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉమ్మడి జిల్లాల సెరికల్చర్, ఉద్యాన శాఖల అధికారులు, ఉమ్మడి జిల్లాల ఎల్డీఎంలు, నాబార్డ్ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ట్యాక్స్ చెల్లించని వాహనాలపై నజర్



- 155 వాహనాలు సీజ్, రూ.28.10 లక్షలు జరిమానా
- జిల్లాలో కొనసాగుతున్న రవాణాశాఖ స్పెషల్ డ్రైవ్

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 : జిల్లాలో త్రైమాసిక పన్ను చెల్లించకుండా రోడ్డుపై తిరుగుతున్న వాహనాలపై రవాణా శాఖ అధికారులు నజర్ పెట్టారు. కొన్ని కాంటాక్ట్ క్యారేజ్ బస్సులు, లారీలు, మ్యాక్సీ క్యాబ్‌లు, కంపెనీ బస్సులు నాలుగు చక్రాల ట్రాలీలు తదితర వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, పొల్యూషన్, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్, ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. త్రైమాజిక పన్ను చెల్లించని వాహనాలను జప్తు చేస్తున్నారు. భారీగా పెనాల్టీ విధిస్తున్నారు. ఇప్పటి వరకు 155 వాహనాలు పన్నుల చెల్లించకుండా రోడ్డుపై నడుస్తున్నట్లు అధికారులు గుర్తించి వాటిని సీజ్ చేశారు. అంతే కాకుండా జరిమానా కూడా విధించారు. రూ.28.10 లక్షల జరిమానా విధించినట్టు అధికారులు చెప్పారు.

పన్ను చెల్లించకుంటే వాహనం సీజ్



వాహన యజమానులు తమ వాహనాల త్రైమాసిక పన్నులు వెంటనే చెల్లించాలి. ట్యాక్స్ చెల్లించకుండా వాహనం రోడ్డుపై తిప్పడం నిబంధనలకు విరుద్ధం. ట్యాక్స్ చెల్లించని వాహనాలను సీజ్‌చేయడంతో పాటు జరిమానా విధిస్తున్నాం. నామినల్ పెనాల్టీతో ట్యాక్స్ చెల్లించే అవకాశాన్ని కల్పిస్తున్నాం.

- ప్రవీణ్‌రావు, జిల్లా రవాణాశాఖ అధికారి



విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టిపెట్టాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5: విద్యార్థులు కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని శ్రీనిధి సెంటర్ ఆఫ్ ఎంట్రప్రెన్యూర్ షిప్ అండ్ ఇన్నోవేషన్ ప్రతినిధి డాక్టర్ శృతి భార్గవ్ చోబే అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇండియా డిజైన్ థింకింగ్ ఫర్ అమృత్ భారత్ అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన డాక్టర్ శృతి మాట్లాడుతూ.. కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ఫలాలను అందరికీ అందించడమే వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. డిజైన్ థింక్‌తో కొత్త అవిష్కరణలు చేయవచ్చన్నారు. నేడు ప్రపంచ దేశాలు తమకు తోచిన కొత్త ఆలోచనలతో తమ ప్రొడక్ట్‌లను ప్రజలకు ఆకట్టుకునే విధంగా ప్రపంచానికి అందిస్తున్నారన్నారు. డైజన్ థింక్‌లో పోటీతత్వం పెరిగి పలు రకాల వస్తువులను కొత్త ఆకర్షణలతో ప్రజల ముందుకు వస్తున్నాయని తెలిపారు. డిజైన్ థింక్ ద్వారా నేడు పేరుగాంచిన అనేక పరిశ్రమలు మంచి ఫలితాలను సాధిస్తున్నాయన్నారు. కొత్త ఆవిష్కరణలకు రూపకల్పన చేసే డిజైన్ థింక్స్‌పై ఆసక్తి కనపరిచాలని కోరారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ.. రానున్న తరాలకు ఉపయోగ పడే పరికరాలు, వస్తువులు, నిత్యం వినియోగించుకునే సామగ్రి ఏవిధంగా ఉండాలన్న విషయాన్ని డిజైన్ థింక్ ద్వారా రూపకల్పన చేసుకోవచ్చన్నారు. ఇంజినీరింగ్ అభ్యసించే విద్యార్థులకు ఇది ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ సరోజారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్‌రెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సరిత, హెచ్‌ఎండీ డాక్టర్ షణ్ముఖ ప్రియ, పీఆర్‌ఓ సుధాకర్ పాల్గొన్నారు.


డాక్టర్ శృతి భార్గవ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 5: ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పక్కా భవనం ఏర్పాటు చేయాలని ఏబీవీపీ జిల్లా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఏబీవీపీ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30సంవత్సరాల తరువాత ఇక్కడ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారని ప్రస్తుతం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిగ్రీ కళాశాల సౌకర్యాలు లేకుండా నడుస్తుందన్నారు. విద్యార్థినులకు కనీసం మూత్రశాలలూ లేవన్నారు. పోస్టులు వెంటనే భర్తీ చేయడంతో పాటు ఐదెకరాల భూమిని కేటాయించి పక్కా భవనాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ జగదీశ్ చారి, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ మంజునాథ్‌రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రావు

నెహ్రూ యువక కేంద్ర జిల్లా కమిటీ సభ్యుడిగా నరేష్‌యాదవ్


ఉత్తర్వుకాపీని అందజేస్తున్న విక్రమ్‌రెడ్డి, తిరుమలరెడ్డి


శామీర్‌పేట, ఫిబ్రవరి 5: నెహ్రూ యువక కేంద్ర అడ్వైజరీ బోర్డు మేడ్చల్ జిల్లా కమిటీ నూతన సభ్యుడిగా శామీర్‌పేట మండలం తూంకుంటకు చెందిన తోకల నరేష్‌యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు కేంద్ర నెహ్రూ యువక కేంద్ర డైరెక్టర్ జనరల్ నితీష్‌కుమార్ మిశ్ర ఉత్తర్వులను జారీచేశారు. ఈ ఉత్తర్వుల కాపీని సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి, కార్యదర్శి అమర మోహన్‌రెడ్డిలు నరేష్‌యాదవ్‌కు అందజేశారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 5: బీఆర్ఎస్ నియోజకవర్గ సమావేశంలో తనను వేదికపై నుంచి దిగిపో అంటూ సామాజిక వర్గం పేరుతో దూషించి దారుణంగా అవమానించిన వ్యక్తులపై వెంటనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లేదంటే అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరాహారదీక్ష చేపడతామని హెచ్చరించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి నాలుగు రోజులవుతున్నా ఇంత వరకు కేసు నమోదు చేయలేదని మండిపడ్డారు.













గ్రామాభివృద్ధిలో కార్మికుల సేవలు వెలకట్టలేనివి

కీసర, ఫిబ్రవరి5: గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్మికుల సేవలు వెలకట్ట లేనివని డీఎల్పీవో స్మిత అన్నారు. మండల పరిధిలోని రాంపల్లి దాయర గ్రామపంచాయతీ కార్యాలయంలో మండల అధికారులు, పంచాయతీ కార్మికులను మాజీ ఉపసర్పంచ్ రాము, కో-ఆప్షన్ సభ్యుడు హనుమంత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అధికారులను సత్కరించి, జ్ఞాపికలను, కార్మికులకు చీరలు, దుస్తులు అందజేశారు. ఎంపీడీవో గ్యామా, మండల విద్యాధికారి శశిధర్, ఎంపీవో వినూత్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకే 'వేతనం' కరువు

- 14 నెలలుగా పెండింగ్
- ఒక్కొక్కరికి రావల్సింది రూ.63,700

వికారాబాద్, ఫిబ్రవరి 5 : ప్రజలచే ఎన్నికై సేవలందిస్తున్న కౌన్సిలర్లకు గౌరవ వేతనం సమయానికి అందడం లేదు. ఏకంగా 14 నెలలుగా వీరికి 'వేతనం' పెండింగ్‌లో ఉంది. వికారాబాద్ మునిసిపాలిటీలో 34 వార్డులు ఉన్నాయి. ఆ వార్డుల కౌన్సిలర్‌లలో ప్రస్తుతం ఒకరు ఛైర్మన్, మరొకరు వైస్‌ఛైర్మన్, 31 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. మునిసిపాలిటీకి వచ్చే ఆదాయంలో జనరల్ ఫండ్ నుంచి సభ్యులకు గౌరవ వేతనం అందించాలి. కానీ వికారాబాద్ మునిసిపాలిటీలో సమయానికి రాకపోవడంతో పలువురు సభ్యులు వేతనం కోసం ఎదురు చూస్తున్నారు. మూడు సంవత్సరాలుగా పాలన అస్తవ్యస్తంగా మారడం కుర్చీల కొట్లాటలు తప్ప మునిసిపల్ అభివృద్ధి కోసం ఆదాయ వనరుల కోసం ఆలోచించే వారే కరువయ్యారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మునిసిపల్ ఛైర్‌పర్సన్ మంజుల రమేష్‌ల మధ్య వైరం పాలనా వ్యవస్థను కుంటు పడేలా చేసిందని పట్టణ ప్రజలు, కౌన్సిల్ సభ్యులు మండిపడ్డ పరిస్థితులు గతంలో ఉండేవి.

పేరుకుపోయిన బకాయిలు

మునిసిపాలిటీలోని 34 వార్డులకు గాను 34 మంది సభ్యులకు ప్రతి నెల రూ. 4550, ఛైర్‌పర్సన్‌కు రూ.19500లు, వైస్ ఛైర్మన్ కు రూ. 9750 చొప్పున గౌరవ వేతనంఅందించాల్సి ఉంది. కానీ వీరికి 14 నెలలుగా గౌరవ వేతనం అందడం లేదు. డిసెంబర్‌లో ఒక నెల వేతనం మాత్రమే వేసినట్లుగా తెలుస్తోంది. ప్రతి సభ్యుడికి రూ. 63,700 ల వరకు రావాల్సి ఉంది. సభ్యులందరికి కలిసి 14 నెలల కాలానికి గాను రూ. 25,75,330 డబ్బులు అందించాల్సి ఉంది.

గతంలో 3250 .. వచ్చిన వారికే డబ్బులు

సభ్యులకు గతంలో ప్రతి నెల రూ. 3250 చెల్లించేవారు. అది కూడా సమావేశానికి హాజరైన సభ్యులకు మాత్రమే ఇచ్చే వారని పలువురు సభ్యులు చెప్పారు. గత ప్రభుత్వం 2022 జనవరి 12న గౌరవ వేతనాన్ని పెంచి ఇవ్వాలని నిర్ణయించింది. కొత్తగా వచ్చిన జీవోతో ప్రతి సభ్యుడికి రూ. 4,550 చెల్లించాలని ఆదేశాలు రావడంతో పెరిగిన వేతనాన్ని అధికారులు వారి ఖాతాల్లో వేస్తున్నారు. వికారాబాద్ మునిసిపల్ లో మాత్రం సభ్యులకు ఇంకా రావడం లేదని, సభ్యులలో ఆర్థిక స్తోమత తక్కువ ఉన్నవారు పలువురు ఉన్నారని, ఈ డబ్బులు వారికిఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పలువురు సభ్యులు పేర్కొన్నారు.


వికారాబాద్ మునిసిపల్ కార్యాలయం

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి

- మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి


కాంగ్రెస్‌లో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 5 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తేవాలని ఆ పార్టీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామ ఎల్లమ్మదేవాలయ కమిటీ ఛైర్మన్ మర్యాద మురళీధర్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు చేరవేయడం కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యకర్తకు ఎలాంటి అవసరం ఉన్నా అండగా ఉంటానని చెప్పారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మకమిటీలు వేసి ప్రభుత్వపథకాలను అర్హులైన వారికి చేరవేయడానికి కృ కృషి చేస్తామని చెప్పారు. కష్టపడే కార్యకర్తలకు కాంగ్రెస్ ఎప్పుడు అన్యాయం చేయదని చెప్పారు. ఏనుగు జంగారెడ్డి, మాజీ ఎంపీపీ కె. రఘుమారెడ్డి, మురళీధర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బాల్‌రాజ్, రమేష్, రాజు, కృష్ణానాయక్, లాజర్, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకోవాలి

- జస్టిస్ చంద్రకుమార్


ఆర్థికసాయాన్ని అందజేస్తున్న జస్టిస్ చంద్రకుమార్, తదితరులు

పరిగి, ఫిబ్రవరి 5 : ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మండలంలోని నజీరాబాద్‌తండాకు చెందిన ఎం.హరిశ్చందర్ అప్పులబాధతో ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబాన్ని సోమవారం రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో పరామర్శించారు. సమితి తరఫున వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పుల బాధతో రైతులు ఆత్మహత్య చేసుకోకూడదని చెప్పారు. చనిపోయిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం ఇస్తున్న సహాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. చనిపోయిన రైతు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రెండు ఎకరాల భూమిని ఇవ్వాలని అన్నారు. రైతు సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఓర్సు ఇంద్రసేన, నాయకులు నర్సింహా, లింగనాయక్, ఎం.ప్రభు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం


పాఠశాలను సందర్శిస్తున్న వెంకట్‌రెడ్డి, తదితరులు

కొడంగల్, ఫిబ్రవరి 5 : మునిసిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, మునిసిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు కల్పించాలని ఉపాధ్యాయులు వారి దృష్టికి తీసుకెళ్లారు. నూతన భవన నిర్మాణ నిర్మాణం, స్థానిక సౌకర్యాల కల్పన కోసం నివేదికలు తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలను సందర్శించి పురాతన తరగతి గదులను తొలగించి నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పక్కనే ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించారు. రెండు పాఠశాలలను సమీకృతంగా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వారి వెంట మునిసిపల్ వైస్ ఛైర్‌పర్సన్ ఉషారాణి, కౌన్సిలర్‌లు, నాయకులు ఉన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 126 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను సోమవారం కొడంగల్ క్యాంపు కార్యాలయంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా రెవెన్యూ అధికారులు, మున్సిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్, పీఏసీఎస్ ఛైర్మన్ కే.శివకుమార్‌గుప్త, వైస్‌ఛైర్‌పర్సన్ ఉషారాణి అందించారు. రూ.1 కోటి 25 లక్షల 89వేల 616 విలువ గల చెక్కులను అందించినట్లు వారు చెప్పారు.కాంగ్రెస్ నాయకులు ఎన్.ప్రశాంత్, కృష్ణంరాజు పాల్గొన్నారు.

పందుల కోసం వేసిన విద్యుత్ కంచె తగిలి రైతు మృతి

- త్రుటిలో బయటపడ్డ మృతుడి కుమారుడు
- అక్రమ విద్యుత్ కనెక్షన్‌తోనే రైతు చనిపోయాడన్న గ్రామస్థులు


రాములు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : పక్క పొలంలో అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ తీగ కాలికి తగిలి ఓ రైతు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం ఉద్దండాపూర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గువ్వల రాములు(57) సోమవారం తన కుమారుడు నరేష్‌తో కలిసి పొలానికి వెళ్లాడు. ఇద్దరూ తమ పొలంలో అవిసె పంటను పరిశీలిస్తున్నారు. పక్కనే ఉన్న రాములు వదిన శంకరమ్మ పొలాన్ని మైసమ్మతండాకు చెందిన రాందాస్ అలియాజ్ పూజారి శెట్టి.. కౌలుకు తీసుకుని జొన్న సాగు చేశాడు. అడవి పందుల నుంచి తన పంటను కాపాడేందుకని రాందాస్ పొలం చుట్టూ విద్యుత్ వైరు పెట్టాడు. ఈ విషయం తెలియని రాములు తన పొలంలో పంట పరిశీలిస్తున్న క్రమంలో పక్కపొలంలో వేసిన విద్యుత్ తీగ కాలికి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదం నుంచి మృతుడి కుమారుడు నరేష్ త్రుటిలో బయటపడ్డాడు. తండ్రి మృతి విషయాన్ని నరేష్ తన కుటుంబసభ్యులు, గ్రామస్థులకు ఫోన్‌చేసి చెప్పాడు. రాములు మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా రాందాస్ అక్రమంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడని, ప్రమాదకరంగా కరెంటు కంచె వేయడం వల్లే తోటి రైతు మృత్యువాత పడ్డాడని, అతడిపై చర్యలు తీసుకొని మృతిచెందిన రైతు కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరారు. నరేష్ ఫిర్యాదు మేరకు విద్యుత్ తీగ తగిలి రాములు మృతిచెందిన స్థలాన్ని రూరల్ సీఐ అశోక్, కరన్‌కోట్ ఎస్సై మధుసూదనరెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానికులను అడిగి వివరాలను సేకరించారు. రాందాస్‌పై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిద్దాం

- ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీ రంగరాజన్

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసే నూతన విద్యావిధానానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ రంగరాజన్ పిలుపునిచ్చారు. జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా సోమవారం మేడ్చల్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యను ప్రైవేటీకరణ చేసేందుకే నూతన విధానం తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేదలకు చదువును దూరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని విమర్శించారు. దేశంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాలు, విదేశీ విశ్వవిద్యాలయాలు పెరిగిపోవడం వల్ల పేదలు ఉన్నత చదువులకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


లీలాలక్ష్మారెడ్డికి మొక్కను అందజేస్తున్న జగన్

కడ్తాల్ , ఫిబ్రవరి 5 : పర్యావరణ పరిరక్షణను అందరు సామాజిక బాధ్యతగా భావించాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్) సంస్థ ఛైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి అన్నారు. మొక్కల పెంపకంపైనే భావితరాల మనుగడ ఆధారపడి ఉంటుందని ఆమె చెప్పారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లిలో ది ఎర్త్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మల్లేపల్లి జగన్ సోమవారం లీలా లక్ష్మారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు జగన్ పూలమొక్కను అందజేశారు. సీజీఆర్ నిర్వాహకుడు లక్ష్మారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

డిజిటల్ యుగానికి ధీటుగా విద్యార్థులను తీర్చి దిద్దాలి

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 : డిజిటల్ యుగంలో పోటీతత్వాన్ని ఎదుర్కునే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకుల పై ఉందని బీహెచ్ఈఎల్ సంస్థ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ మోహన్ రావు అన్నారు. మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఆఫ్ ఉమెన్స్ యూజీసీ అటానమ్‌స్‌లో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మోహన్‌రావు మట్లాడుతూ.. వేగవంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులపై అధ్యాపకులు ముందుగా దృష్టి సారించి వాటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. కంప్యూటర్ సైన్స్‌ను బోధించే అధ్యాపకులు తమ బోధనా విధానాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని డాక్టర్ చక్రవర్తి భగవతి అన్నారు. సబ్జెక్టు విషయంలో అధ్యాపకులు ముందుగా అప్‌డేట్ కావాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవిలత, డాక్టర్ రుక్మ రేఖ, పాల్గొన్నారు.

టీజీ అక్షరాల ఏర్పాటు అభినందనీయం

- మాజీ హోంమంత్రి టి. దేవేందర్‌గౌడ్



మహేశ్వరం, ఫిబ్రవరి 5 : వాహనాల నెంబర్ ప్లేట్లపై టీజీ అనే అక్షరాలు ఉండాలని ఉద్యమ సమయంలో తాను చేసిన ప్రతిపాదనను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను అమలు చేస్తున్నందుకు ఆనందంగా ఉందని ఉమ్మడి రాష్ట్ర మాజీ హోంమంత్రి టి. దేవేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం తుక్కుగూడలోని ఆయన నివాసంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వాహనాల నెంబర్ ప్లేట్ల విషయమేకాకుండా ప్రజలకు సంబంధించిన అనేక అంశాలలో కేసీఆర్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోయి ప్రజల మనస్సులను గాయపర్చిందన్నారు. కేంద్రం టీజీ అని గెజిట్ ఇస్తే కేసీఆర్ టీఎస్ అని మార్చారని ఆరోపించారు. ఈ ప్రతిపాదనను తాను 2008లోనే చెప్పానని గుర్తుచేశారు. నాడు ఏపీ అక్షరాలను వాహనాలపై తొలగించి టీజీ అక్షరాలు రాయాలని నవ తెలంగాణ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టామన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు నోటిఫికేషన్

- కసరత్తు ప్రారంభించిన అధికారులు
- సి - నోటిఫికేషన్ జారీ


ఆర్డీఓ శ్రీనివాసరావు

తాండూరు, ఫిబ్రవరి 5 : పట్టణంలో రోడ్ల విస్తరణకు ప్రణాళిక సిద్ధమైంది. ఇందిరాచౌక్ నుంచి తాండూర్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు విస్తరణకు అడుగు ముందుకు పడింది. ఈ మేరకు మునిసిపల్, రెవెన్యూశాఖలు సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ, ఒకే సమావేశంతో పెండింగ్‌లో పడింది. ఇప్పుడు ఈరోడ్డును 80 ఫీట్ల వెడల్పుతో, డివైడర్‌కు ఇరువైపుల 40 ఫీట్ల చొప్పున విస్తరించనున్నారు. ఇటీవల రోడ్డుకిరువైపులా ఉన్న ఇళ్ళు, ఖాళీస్థలాలు, దేవాదాయ ఆస్తులను మునిసిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల బృందం సర్వే చేసి నివేదికను రెవెన్యూ డివిజనల్ అధికారికి సమర్పించారు. ఇరువైపులా సర్వే నెం. 133, 134, 135ల్లో ఉన్న 94 భవనాలను గుర్తించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియలో భాగంగా పునరావసం, నష్టపరిహారం పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 ద్వారా సే - నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ రోడ్డు విస్తరణలో స్థలాలు, ఇళ్లు పోతున్న వ్యక్తులు 60 రోజులలో జిల్లా కలెక్టర్, తాండూరు ఆర్డీఓ వద్ద అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించారు. ఆ భూముల అమ్మకం, కొనుగోలు చేయొద్దని, ఎటువంటి రుణాలు తీసుకోవద్దని పేర్కొన్నారు.

నోటిఫికేషన్ విడుదల చేశాం - ఆర్డీఓ

ఇందిరాచౌక్ నుంచి రైల్వేస్టేషన్ వరకు గల రోడ్డు విస్తరణకు ఫామ్ - సి నోటిఫికేషన్ విడుదల చేశాం. కావున ఈ మార్గంలో విస్తరణ ప్రక్రియ ముగిసే వరకు ఆస్తిమార్పిడి, అమ్మకాలు చేయకుడదు. ఈ రోడ్డులో ఉన్న భవనాలు, ఖాళీస్థలాల యజమానుల అభిప్రాయాలు పరిగణంలోకి తీసుకుటాం.

ఇంటిపన్ను రశీదు ఇవ్వడం లేదని కమిషనర్‌కు ఫిర్యాదు

- విచారణ జరపాలని డిమాండ్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 5 : ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఇంటిపన్నులకు రశీదులు ఇవ్వకుండ పలువురు మునిసిపల్ సిబ్బంది చేతి వాటం ప్రదర్శిస్తున్నారని దాసరి బాల్‌నర్సింహ అనే వ్యక్తి సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో 200 చదరపు గజాల స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే దానికి రూ.48,500 ఇంటి పన్ను విధించగా.. గత సంవత్సరం జూలై 19న మునిసిపల్ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ అనితకు ఆ మొత్తాన్ని చెల్లించినప్పటికీ నేటికీ ఇంటిపను రశీదు ఇవ్వడంలేదని చెప్పాడు. పలుమార్లు రశీదు గురించి అడిగితే సమాధానం చెప్పకుండా దాటవేస్తోందని వాపోయాడు. ఆమెను గట్టిగా నిలదీస్తే తాను ఇచ్చిన డబ్బులు కౌన్సిలర్ అంజనేయులు వద్ద ఉన్నాయని చెబుతున్నట్లు తెలిపాడు. ఆమెపై విచారణ జరిపి చర్యలు తీసుకుని తనకు రశీదు ఇప్పించాలని బాల్‌నర్సింహ డిమాండ్ చేశాడు. కాగా గతంలో మున్సిపాలిటీకి చెందిన ఓ బిల్‌కలెక్టర్ రూ.3కోట్లకు పైగా పన్నులు వసూలు చేసిన సొమ్మును స్వాహా చేసిన విషయం తెలిసిందే ఈవిషయమై విచారణ జరుగుతండగానే నెలల తరబడి రశీదు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న విషయం వెలుగు చూడటంపై పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు


పూజలు చేస్తున్న అర్చకులు

చేవెళ్ల, ఫిబ్రవరి 5 : పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం సోమవారం గోవింద నామస్మరణతో మారుమోగింది. దేవాలయంలో జరుగుతున్న రథోత్సవ జాతరలో భాగంగా మొదటి రోజు దేవాలయంలో ప్రధాన అర్చకులు పుణ్యావాచన, ధ్వజారోహణము, అఖండదీపారాధనతో పాటు రాత్రి స్వామి వారిని శేష వాహనంపై కన్నుల పండువగా ఊరేగించారు. ఈ సందర్భంగా దేవాలయం వ్యవస్థాపక ధర్మకర్తలు పూజారి శ్రీకాంత్, శ్రీపాదులు మాట్లాడుతూ. ఈనెల 9 వరకు ప్రత్యేకపూజ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. 9న అమావాస్య రోజు స్వామి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని చెప్పారు. దేవాలయ ఈవో నరేందర్, భక్తులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

మేడ్చల్ మున్సిపల్‌లో పౌర సేవా కేంద్రం

మేడ్చల్ టౌన్, ఫిబ్రవరి 5 : స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించటంలో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా పౌర సేవా కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు తగిన సమాచారం ఇవ్వటంతో పాటు, ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను ఇక్కడ స్వీకరిస్తారు. ఈ సెంటర్ నిర్వాహణకు ప్రత్యేకంగా ఇద్దరు సిబ్బందిని నియమిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అనంతగిరి పల్లిలో బొడ్రాయి ఉత్సవాలు

వికారాబాద్, ఫిబ్రవరి 5 : మునిసిపల్ పరిధిలోని అనంతగిరిపల్లిలో నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. కౌన్సిలర్ మురళి, అనంతయ్య, బాగయ్య, రాజునాయక్, రెడ్డి శేఖర్, నర్సింహులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ కౌన్సిలర్‌పై కేసు నమోదు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 5 : గోశాలలోకి అక్రమంగా ప్రవేశించి, అసభ్యకరమైన పదజాలంతో దూషించి, బెదిరింపులకు పాల్పడిన 4వ వార్డు కౌన్సిలర్ అంజనేయులుగౌడ్‌తో పాటు పలువురిపై ఘట్‌కేసర్ పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని మాధవరెడ్డి వంతెన సమీపంలోని గోశాలలోకి ఆంజనేయులుగౌడ్ మరికొంతమందితో అక్రమంగా ప్రవేశించి అసభ్యకరంగా దూషించి, బెదిరింపులకు పాల్పడినట్లు గోశాల నిర్వాహకుడు నల్లబోతు వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోశాలను ఎందకు పెట్టావ్, దాన్ని మూసివేయిస్తానని బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.


ఏఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలి

షాబాద్, ఫిబ్రవరి 5 : లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించి వ్యవసాయ బోరు బావుల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, షాబాద్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి కోరారు. ఈమేరకు మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ ఏఈ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్‌లో నాణ్యత లోపించి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మండలంలోని కేశవగూడ, ఎర్రోనిగూడ, గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో నాణ్యత లోపించి బోరు మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు గోపాల్‌రెడ్డి, మల్లయ్య, బీరయ్య, చెన్నయ్య, కృష్ణయ్య, బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

కత్తి పద్మారావుపై చర్యలు తీసుకోవాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 5: హిందూ ధర్మం, శ్రీరాముడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కత్తి పద్మారావుపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు సోమవారం ఆమనగల్లు పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ బాల్‌రామ్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఓ యూట్యూబ్ చానల్ వేదికగా పద్మారావు చేసిన వ్యాఖ్యలను వెంటనే తొలగించాలని, అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు అశాంతికి ఆజ్యం పోసేలా ఉన్నాయన్నారు. ప్రధాన కార్యదర్శి వినోద్, కల్వకుర్తి ఇన్‌చార్జి కృష్ణ, ఎట్టి రాజు, తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్ మున్సిపల్ బడ్జెట్ రూ.26.37 కోట్లు

- ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదం
- పారిశుధ్య నిర్వహణకు 19.62 కోట్లు

షాద్‌నగర్, ఫిబ్రవరి 5 : పట్టణ మున్సిపల్ బడ్జెట్ రూ.26 కోట్ల 37లక్షల 31వేలకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఈమేరకు సోమవారం షాద్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ రూపొందించిన బడ్జెట్‌లో ప్రారంభ నిల్వ, ప్రభుత్వ గ్రాంట్లతో కలుపుకుని బడ్జెట్‌ను అంచనా వేసింది. ఇందులో అంచనా మొత్తం వ్యయం రూ.25 కోట్ల 79లక్షల 90వేలు, ముగింపు నిల్వ(మిగులు) బడ్జెట్ రూ.57.41 కోట్లు, సొంత రెవెన్యూ 20.20 కోట్లు, సొంత వ్యయం 19.62 కోట్లు, గ్రాంట్స్ ఆదాయం 6.17 కోట్లు, గ్రాంట్స్ వ్యయం రూ.6.17 కోట్లుగా చూపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

హాజరై మాట్లాడుతూ బడ్జెట్ రూపకల్పనలో కౌన్సిలర్ల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధులతో షాద్‌నగర్ పట్టణాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. వార్డుల అభివృద్ధి విషయంలో కౌన్సిలర్లు అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా వార్డులను సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. పట్టణంలో సెట్ బ్యాక్ విషయంలో గందరగోళం నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో అందరినీ సమానంగా చూడాలని ఆదేశించారు. సెట్‌బ్యాక్ విషయంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్‌కు తెలిపారు. అన్ని వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని, ప్రస్తుతం ఉన్న సెప్టిక్‌ట్యాంక్‌ల నిర్మాణం సరిపోదన్నారు. షాద్‌నగర్ పట్టణ భూమి సమతుల్యంగా లేదని, ఒకచోట ఎత్తు, మరోచోట పల్లంగా ఉండటం వల్ల భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా సమగ్రమైన డీపీఆర్‌ను రూపొందించాలని కమిషనర్ వెంకన్నకు సూచించారు. మున్సిపల్ స్టడీటూర్ చేపట్టినప్పుడు ఆ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధిపై అక్కడి అధికారులతో చర్చించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నరేందర్, కమిషనర్ వెంకన్న, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం


చేవెళ్ల : సన్మాన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శైలజాఆగిరెడ్డి, ప్రత్యేకాధికారి, వార్డుసభ్యులు

చేవెళ్ల/కేశంపేట, ఫిబ్రవరి 5 : గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని చేవెళ్ల తహసీల్దార్, ప్రత్యేకాధికారి కృష్ణయ్య అన్నారు. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా చేవెళ్ల గ్రామ తాజా మాజీ సర్పంచ్ బండారు శైలజాఆగిరెడ్డితో పాటు పంచాయతీ పాలకవర్గం సభ్యులను సోమవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. శైలజాఆగిరెడ్డి మాట్లాడుతూ తనకు రాజకీయ జీవితం ఇచ్చి.. ఐదేళ్లుగా పని చేసేందుకు అవకాశం ఇచ్చిన ప్రజలకు రుణపడి ఉంటామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, తాజా మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య, వార్డు సభ్యులు, కార్యదర్శి వెంకట్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఐదేళ్లుగా గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామస్తుల సహకారం మరువలేనిదని, సహకరించిన వార్డుసభ్యులు, గ్రామస్తులకు రుణపడి ఉంటానని తొమ్మిదిరేకుల తాజా మాజీ సర్పంచ్ సావిత్రి బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. జీపీ కార్యాలయంలో ఇటీవల పదవీ కాలం పూర్తిచేసుకున్న సర్పంచ్, ఉపసర్పంచ్ రాంరెడ్డి,లతో పాటు వార్డుసభ్యులను గ్రామస్తులు, షాద్‌నగర్ ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్‌లు సన్మానించారు. ఎంపీటీసీ యాదయ్య, ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, ఎంపీవో నర్సింహ, చంద్రారెడ్డి, లాలమోని ఆంజనేయులు, పురుషోత్తంగౌడ్, యాదగిరి, బాలయ్య, నర్సింలు, ఆంజనేయులు, మల్లేష్, గుత్తి ఆంజనేయులు, అరవింద్‌రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట : తొమ్మిదిరేకుల మాజీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్తులు

సమస్యల పరిష్కారానికే దేశవ్యాప్త సమ్మె

- తెలంగాణ జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి


కందుకూరు : ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్, కార్మికులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 5 : గ్రామీణ కార్మికులు అంగన్‌వాడీ, ఆశా, పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకే ఈనెల 16న దేశవ్యాప్త గ్రామీణ కార్మిక సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్యలు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్మికులతో కలిసి సీనియర్ అసిస్టెంట్ షబ్బీర్‌ఖాన్‌కు సమ్మె నోటీసు అందించారు.

- **కేశంపేట** : 16న నిర్వహించే దేశవ్యాప్త గ్రామీణ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలతో కలిసి డాక్టర్ నిఖితకు, మధ్యాహ్న భోజన కార్మికులతో కలసి ఎంఆర్‌సీ సిబ్బందికి సమ్మె నోటీసు అందించారు. ఎన్‌డీఏ-2 ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తోందని ఆరోపించారు. రైతాంగ, వ్యవసాయ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి కాలం చెల్లిందన్నారు. ఆశాల సంఘం అధ్యక్షులు వసంత, సుజాత, సునీత, లక్ష్మీదేవి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.
- **ఆమనగల్లు** : 16న దేశ వ్యాప్తం సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు శివశంకర్ కోరారు. పట్టణంలో సమ్మె, భారత్ బంద్ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ కు సమ్మె నోటీసును సీఐటీయూ నాయకులతో కలిసి ఆశా కార్యకర్తలు అందజేశారు. ఆశా కార్యకర్తల మండల అధ్యక్షురాలు బీబీ షేక్, కార్యదర్శి సల్మా, ఉపాధ్యక్షురాలు మంజుల, సహాయ కార్యదర్శి అలివేలు, నిర్మల, సీఐటీయూ జిల్లా నాయకుడు పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : కేంద్ర ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈనెల 16న మధ్యాహ్న భోజన కార్మికులు గ్రామీణ భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షుడు కిషన్‌జీ, సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టిరాజ్‌లు తెలిపారు. సోమవారం ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు సమ్మె నోటీలు ఇచ్చారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు కె.శ్రీనివాస్, అశ్విని, అండాలు, కళమ్మ, సుజాత, లావణ్య, విజయ, హైమావతి, తదితరులున్నారు.


చౌదరిగూడ : పంచాయతీ కార్మికులతో కలిసి సమ్మె నోటీసు అందజేస్తున్న నర్సింహారెడ్డి, జంగయ్య

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


పుస్తకాలు అందిస్తున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

తలకొండపల్లి, ఫిబ్రవరి 5 : ప్రభుత్వ పాఠశాలల్లోనే శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్య అందుతుందని ఐక్యత ఫౌండేషన్ సభ్యులు అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్జాల్, రాంపూర్, ఖానాపూర్, పడకల్, చుక్కాపూర్, చంద్రధన పాఠశాలల్లో సోమవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్కాన్ అండ్ లర్న్ డిజిటల్ కంటెంట్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన పుస్తకాలను సభ్యులు నరేందర్, తిరుపతయ్య గౌడ్‌లు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందజేశారు.

నులి పురుగులను నిర్మూలిద్దాం

షాబాద్, ఫిబ్రవరి 5 : నులిపురుగులను నిర్మూలిద్దామని డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రధానోపాధ్యాయులు, అధికారులు, ఆశావర్కలు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 19 వరకు నులిపురుగుల మాత్రలు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లకు పంపిణీ చేస్తామన్నారు. మిగిలినవారికి ఇంటి వద్దకు వెళ్లి వేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శంకర్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా అందించాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 5:రేషన్ దుకాణాల డీలర్లు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నడుచుకోవాలని, రేషన్ సరుకులు సక్రమంగా అందించాలని ఆమనగల్లు తహసీల్దార్ లలిత అన్నారు. మండలంలోని గౌరారంలో కొత్తగా మంజూరైన రేషన్ దుకాణాన్ని సోమవారం ఎంపీడీవో పారుఖ్‌హుస్సైన్, ఎంపీటీసీ నిట్ట మంగమ్మ నారాయణ, డీలర్ శివానిలతో కలిసి లలిత ప్రారంభించారు. తిరుపతయ్య, అర్జుం ప్రసాద్, వెంకటాపురం శివ, డీలర్ శివాని, తదితరులు ఉన్నారు.


రేషన్‌షాపును ప్రారంభిస్తున్న తహసీల్దార్ లలిత, ఎంపీటీసీ మంగమ్మ నారాయణ

ప్రొ.కోదండరాంను కలిసిన మొగిలిగిద్ద గ్రామస్తులు

షాద్‌నగర్ రూరల్/ఆమనగల్లు, ఫిబ్రవరి 5 : ఇటీవల ఎమ్మెల్సీలుగా నియమించిన ప్రొఫెసర్ కోదండరాం, మీర్ అమీర్‌అలీ ఖాన్‌లను సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి చెందిన పలువురు కలిశారు. చారిత్రక ప్రాముఖ్యత కలిగిన మొగిలిగిద్దలో పాఠశాల ఏర్పాటుచేసి 150 ఏళ్ల పూర్తవుతోందని వారికి వివరించారు. ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేసిన తర్వాత తమ పాఠశాలకు రావాలని కోదండరాంను కోరినట్లు తెలిపారు. శ్యాంసుందర్, మల్లేష్ ఉన్నారు. అదేవిధంగా జేఏసీ కన్వీనర్ ప్రొ.కోదండరామ్ సోమవారం ఆమనగల్లు మండలంలో పర్యటించారు. ఉర్కొండపేట శ్రీఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో కోదండరాం పాల్గొన్నారు. తిరుగు ప్రయాణంలో ఆమనగల్లులోని తన అనుచరుడు జహంగీర్ నివాసానికి చేరుకున్నారు. పలువురు నాయకులు జేఏసీ నేతలు కోదండరామ్‌ను సత్కరించారు. స్థానిక పరిస్థితులపై కోదండరాం నాయకులను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ యాదిలాల్, జేఏసీ కన్వీనర్ శివలింగం, ప్రైవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర నాయకుడు అల్లాజీగౌడ్, ప్రముఖ కవి గోపాల్‌జీ, పరమేష్, జానకి రాంరెడ్డి తదితరులున్నారు.


కోదండరాంతో మొగిలిగిద్ద గ్రామస్తులు

ఎస్సై శ్రీకాంత్‌కు సన్మానం

తలకొండపల్లి, ఫిబ్రవరి 5 : తలకొండపల్లి ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను సోమవారం మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీకాంత్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలంత సహకరించాలని ఎస్సై కోరారు. నాయకులు మల్లేశ్, ఈశ్వర్, దశరథం, వెంకటయ్య, సజ్జు పాష, జంగయ్య, యాదయ్య, చంద్రశేఖర్ తదితరులున్నారు. కాగా, నూతనంగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్ సోమవారం దేవునిపడకల్ గ్రామంలోని వేంకటేశ్వరాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ కాడెమోని శ్రీశైలం, ఆలయ నిర్వాహకులు ఆయన్ను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఏఎస్సై సీతారాంరెడ్డి, దేవునిపడకల్ గ్రామ నాయకులు భిక్షపతి, పూజారులు పద్మనాభం, తదితరులున్నారు.


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ప్రతిభగల క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు

కందుకూరు, ఫిబ్రవరి 5 : ప్రతిభగల క్రీడాకారులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఐదు రోజులుగా మండల కేంద్రంలోని నవతరం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో 8టీమ్‌లు పాల్గొన్నారు. సోమవారం ఫైనల్‌లో గెలుపొందిన వారికి ఎంపీటీసీ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. మొదటి బహుమతి గెలుపొందిన టీంకు అర్జున అవార్డు గ్రహీత వెదిరె రవికాంత్‌రెడ్డి రూ.25నగదు, షీల్డు అందజేశారు. ద్వితీయ బహుమతిని మీర్కాన్‌పేటకు చెందిన శివచారి రూ. 12,500, షీల్డు అందజేశారు. నవతరం యూత్ అధ్యక్షుడు ఎం.మహేందర్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్‌చారి, తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, ఎండీ అజీజ్‌ఖాన్, టి.వినోద్‌చారి, ఎస్.వెంకటేష్‌గౌడ్, బి.రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, జి.రవీందర్, తదితరులున్నారు. కాగా, బాచుపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంటులో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీటీసీ సురేష్ బహుతులు అందజేశారు. మొదటి బ హుమతిని గ్రామానికి చెందిన ఎగిరిశెట్టి రాజు రూ.10వేల నగదు, ద్వితీయ బహుమతి ని కృష్ణ రూ.6వేల నగదు, బహుమతిని అందజేశారు. యువజన సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో ఎంపీటీసీ రాజశేఖర్‌రెడ్డి, నిర్వాహకులు

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కొత్తూర్, ఫిబ్రవరి 5: తన తండ్రి జ్ఞాపకార్థం, 5వ వర్ధంతిని పురస్కరించుకుని స్వగ్రామంలో విద్యార్థులకు గన్నీబ్యాగులు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నాడు ఓ కుమారుడు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామానికి చెందిన మామిడి సత్యనారాయణరెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకొని అతని కుమారుడు హైదరాబాద్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మామిడి భీంరెడ్డి పెంజర్ల ఉన్నత పాఠశాలకు విద్యార్థులకు బ్యాగులు, ప్యాడ్లు, పెన్నులు, మాస్కులు, డిన్నర్‌సెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జగదీశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, మాజీ ఉపసర్పంచ్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


బ్యాగులు పంపిణీ చేస్తున్న మామిడి భీంరెడ్డి

అబాకస్ పోటీల్లో లిటిల్ స్కాలర్స్ విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు, ఫిబ్రవరి 5: వేదిక్ మ్యాథ్స్, అబాకస్ పోటీల్లో లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. డివిజన్ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఐశ్వర్య రెడ్డి, స్నేహలత, లక్ష్మీప్రియలు పోటీలలో గెలుపొందారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో గెలుపొందిన విద్యారులు ఐశ్వర్య రెడ్డి, స్నేహలత, లక్ష్మీప్రియలను పాఠశాల చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్, డైరెక్టర్ సావిత్రి, కరస్పాండెంట్ సుజా, అకాడమిక్ అడ్వైజర్ సుదర్శన్ రెడ్డి లు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టుదల, ఏకాగ్రతతో లక్ష్యాన్ని సునాయాసంగా చేరుకవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్వేత, హైమావతి, రాధిక, గీత, స్వాతి, చలం, శ్రీశైలం, వెంకటేశ్వర్లు, శ్రీజన్య, మమత, తేజ, నందిని, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కొందుర్గు** : రాంచంద్రాపూర్ చౌరస్తాలో వాహనాల స్పీడ్‌ను తగ్గించేందుకు గాను సోమవారం బారికేడ్లను ఏర్పాటు చేశారు. పర్వతాపూర్ గ్రామానికి చెందిన భీమ్‌పే బ్యాక్ సొసైటీ సభ్యులతో పాటు దర్గా వెంకటేష్ కలిసి కొందుర్గు ఎస్సై కృష్ణయ్యకు తెలుపడంతో రాంచంద్రాపూర్‌లో బారికేడ్లను ఏర్పాటు చేయించారు. ఎస్సైని సభ్యులు సన్మానించారు.
- **కందుకూరు** : కాంగ్రెస్ పార్టీ దాసర్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎండీ ఖాజామియాను ఎన్నుకున్నట్లు ఆ పార్టీ ఇన్‌చార్జి యుగేందర్‌గౌడ్ ప్రకటించారు. ఈమేరకు సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు అధ్యక్షుడిగా ఖాజామియా, ఉపాధ్యక్షులుగా పి.రాజు, టి.బాల్‌రాజ్, వి.కృష్ణయ్యలను ఎన్నుకున్నట్లు తెలిపారు. త్వరలో పూర్తిస్థాయి కమిటీని ఎన్నకోనున్నట్లు చెప్పారు.
- **యాచారం** : తాటిపర్తిలో గ్రామ యువకులు ఉచిత రక్త పరీక్ష క్యాంప్ నిర్వహించారు. సర్పంచ్ రమేష్, యువకులు శివ, రాఘవేందర్, సురేష్, రమేష్‌లు కలిసి కామన్ సర్వీస్ సెంటర్ సహకారంతో రక్తపరీక్ష కేంద్రాన్ని నిర్వహించారు. 16 రకాల పరీక్షలు చేశారు.
- **కడ్తాల్** : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. పాలమూరు ప్రగతి కోసం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చేపట్టిన న్యాయ్‌యాత్రలో కడ్తాల, ఆమనగల్లు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వంశీచంద్ రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డిలతో కలిసి వారు పాల్గొన్నారు. వంశీచంద్‌రెడ్డిని సత్కరించారు.
- **షాబాద్** : మండలంలోని చిన్నసోలిపేట్ గ్రామానికి చెందిన 23 మంది శివస్వాములు శేఖర్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో పాదయాత్రగా బయల్దేరి సోమవారం శ్రీశైలం ఆలయానికి చేరకున్నారు. 204 కిలోమీటర్లు 5 రోజుల పాటు నడిచినట్లు తెలిపారు. శ్రీశైల మల్లిఖార్జునుడి దర్శనానంతరం వారు తిరుగుప్రయాణం అవుతారు.
- **చేవెళ్ల** : ప్రభుత్వం మారినా విద్యార్థులపై అరాచకాలు ఆగడం లేదని ఏబీవీపీ శంషాబాద్ విభాగ్ కన్వీనర్ సూర్యప్రకాశ్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లాలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడాన్ని నిరసిస్తూ పట్టణ కేంద్రంలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

- నలుగురికి తీవ్ర గాయాలు


కిష్టయ్య(ఫైల్)

మొయినాబాద్, ఫిబ్రవరి 5 : ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతో రాంగ్ రూట్‌లో ముందున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయడంతో ఆటో బోల్తాపడింది. దాంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి తీవ్రగాయాలు కాగా, ఒకరిని ఆసుప్రతికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీస్‌లు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లికి చెందిన ప్యాసింజర్ ఆటో(టీఎస్07యూఏ9247) సోమవారం సాయంత్రం గ్రామం నుంచి సుమారు పదిమంది వరకు ప్రయాణికులను ఎక్కించుకొని మొయినాబాద్‌లో జరిగే సంతకు వెళ్లింది. ఈక్రమంలో ఆటో డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా ఆటోను నడుపుతూ మండల పరిధిలోని అప్పరెడ్డిగూడ గ్రామానికి రాగానే.. మట్టి రోడ్డు సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ డోజర్‌ను ఎడమ వైపునుంచి ఓవర్‌టేక్ చేసి వెళ్లేందుకు యత్నించాడు. దాంతో ట్రాక్టర్ డోజర్ ముందు జాతీయ రహదారిపై ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న అనిమోని కిష్టయ్య(71) తలకు బలమైన దెబ్బతగలడంతో పాటు కాలు విరిగి రక్తస్రావమైంది. అతడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆయన కూతురు సంతోషకు తీవ్రగాయలు కాగా.. మరో మహిళ కిష్టమ్మ చేయి విరిగింది. హస్మ అనే మహిళ కాలు విరిగింది. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీస్‌లకు సమాచారం అందడంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలస్యంగా ఘటనా స్థలానికి అంబులెన్స్!

ఆటో ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు కాళ్లు, చేతులు విరగడంతో పాటు వృద్ధుడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అయితే, అంబులెన్స్ మాత్రం గంట తర్వాత సంఘటన స్థలానికి చేరుకుంది. అప్పటికే పూర్తిగా రక్తస్రావంతో ఉన్న కిష్టయ్యను ఆసుప్రతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కాగా, ప్రమాదం జరిగిన గంటవరకు కిష్టయ్య ప్రాణాలతో ఉన్నాడని అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే ఆయన ప్రాణాలతో బయటపడేవాడని ఈ సందర్భంగా స్థానికులు వాపోయారు.

వేర్వేరు చోట్ల గంజాయి స్వాధీనం.. ముగ్గురి అరెస్ట్

శంకర్‌పల్లి/చౌదరిగూడ, ఫిబ్రవరి 5 : వేర్వేరు చోట్ల అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శంకర్‌పల్లి ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన శ్యామ్ వైద్యనాథ్, కౌశబాయ్‌లు కొంతకాలంగా ఏపీలోని విశాఖపట్నం నుంచి గంజాయి తీసుకొచ్చి హైదరాబాద్ నగర శివారులో విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దాంతో శంకర్‌పల్లి చౌరస్తాలో తనిఖీ నిర్వహించగా వైద్యనాథ్, కౌశబాయ్‌లు పట్టుబడ్డారు. వారిని నుంచి 31కిలోల ఎండుగంజాయి స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ దాదాపు రూ.78లక్షలు ఉంటుందని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదేవిధంగా చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ చౌరస్తా వద్ద గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఎస్సై శక్రు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన వికాస్ పటేల్ లాల్‌పహాడ్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. పోలీసులు గమనించి విచారించారు. అతడి వద్ద 450 గ్రాముల గంజాయి దొరికింది. సెల్‌ఫోన్, రూ.500 నగదు, గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

కడుపునొప్పి భరించలేక ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల, ఫిబ్రవరి 5 : కడుపునొప్పి భరించలేక ఇంట్లో దులానికి ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి జాలగూడ గ్రామంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జాలాగూడకు చెందిన ఖానాపూరం నర్సింహారెడ్డి కుమారుడు సత్యనారాయణరెడ్డి(48) గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటి మాదిరిగానే పొలం పనులకు వెళ్లి వచ్చిన తర్వాత ఇంట్లో ఉండగా కడుపునొప్పి అధికమైంది. దాంతో నొప్పి భరించలేక ఇంట్లో దులానికి తాడుతో ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చేవెళ్లలోని మహేందర్‌రెడ్డి ఆసుప్రతికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే, కడుపు నొప్పితోనే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కుటుంబసభ్యులు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 5 : గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జనవాడ గ్రామ శివారులోని బీరప్ప గుడి ఎదుటగల ఖాళీ స్థలంలో 20 నుంచి25 ఏళ్ల వయస్సున్న మహిళ విగతజీవిగా పడి ఉందని స్థానిక ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మోకిల పోలీసులు వెళ్లి పరిశీలించగా అప్పటికే చనిపోయి ఉంది. మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం కుడి చేయి విరిగి ఉందని, మృతురాలి ఒంటిపై తెలుపు రంగు ప్యాంటు, నలుపు రంగు టీషర్టు ఉందని పోలీసులు తెలిపారు. అదేవిధంగా కుడి చేతిపై మెహందీతో రేష్మి, సర్వన్ అమీర్‌ఖాన్, కిరణ్ సార్, రవి తేరా లవ్ యూ అని రాసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈమేరకు గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ఆర్టీసీ అద్దె బస్సు-డీసీఎం ఢీ.. వ్యక్తి దుర్మరణం

యాచారం, ఫిబ్రవరి 5 : ఆర్టీసీ అద్దె బస్సు-డీసీఎం ఢీకొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన సోమవారం యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గున్‌గల్ గేటు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు(టీఎస్07యుకె 4885) ఇబ్రహీంపట్నం వైపు నుంచి దేవరకొండకు వెళుతోంది. ఈక్రమంలో బస్సుకు ఎదురుగా వస్తున్న డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న బస్ దగ్గరికి రాగానే అకస్మాత్తుగా పక్కకు తప్పించేందుకు యత్నించాడు. దాంతో బస్సు బయటకు తలపెట్టి చూస్తున్న యేసు(35)కు డీసీఎం వెనకభాగాన ఉన్న ఇనుప రాడ్ బలంగా తగలడంతో తల పగిలింది. దాంతో అతడు బస్సులోనే ప్రాణాలు వదిలాడు. ప్రయాణికుడి మరణానికి కారకుడైన డీసీఎంను మంచాల మండలంలోని ఆగాపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. కాగా, మృతుడు యేసు ప్రకాశం జిల్లా కోళ్లచెరువు మండలంలోని గంగారంవాసి, అతడు నగరంలోని మణికొండలోని సైబర్‌టవర్ వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపాల్ చెప్పారు.

బోరు మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ తొలగించారని..

మనస్తాపంతో రైతు ఆత్మహత్యాయత్నం

కొందుర్గు, ఫిబ్రవరి 5: తోటి రైతులు వ్యవసాయ బోరు మోటర్ విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో ఓ రైతు మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండల పరిధిలోని తంగళ్లపల్లిలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పెరుమాల్‌రెడ్డికి మూడెకరాల పొలం ఉండగా వరిని సాగు చేశాడు. ఇటీవల పొలంలో బోరు వేశాడు. అయితే, మోటరు కనెక్షన్ కోసం డీడీ కూడా కట్టాడు. విద్యుత్ అధికారులు ఆదివారం బోరు మోటరు కనెక్షన్ ఇచ్చారు. అయితే, 63కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెరుమాల్‌రెడ్డికి కనెక్షన్ ఇవ్వడంతో లోడ్ ఎక్కువై మిగతా రైతుల మోటర్లు ఆగిపోయాయి. దాంతో ఆ రైతులు పెరుమాల్‌రెడ్డి బోరు మోటర్ కనెక్షన్‌ను తొలగించారు. మనస్తాపానికి గురైన పెరుమాల్‌రెడ్డి ఆదివారం రాత్రి పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరామర్శించారు.

నిషేధిత ఇంజక్షన్లు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 : నిషేధిత ఇంజక్షన్లను విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శంషాబాద్ ఎస్వోటీ పోలీసులు పట్టుకుని శంషాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మండల పరిధిలోని సంఘీగూడలో ఇద్దరు వ్యక్తులు నిషేధిత ఇంజక్షన్లు అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్వోటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. దాదాపు రూ. 2 లక్షల విలువ గల ఇంజక్షన్లను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలు త్వరలోనే వివరిస్తామని పోలీసులు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.